అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

- ముడసర్లోవ ప్రాంతంలో మందుబాబులు, ఆకతాయిల ఆగడాలు
- విశాలమైన రహదారుల్లో తిష్ట వేసి గంజాయి, మద్యపానం



ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక ప్రాంతంలో డంప్‌చేసిన డెబ్రిస్



ముడసర్లోవ రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, ముళ్ల తుప్పలు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఇక్కడ విశాలమైన రోడ్లు, ఖాళీ స్థలాలు వీటికి అనుకూలంగా తయారయ్యాయి. ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక ఖాళీ స్థలాల మధ్య సుమారు 15 ఏళ్ల కిందట జీవీఎంసీ విశాలమైన రోడ్లు నిర్మించింది. ఇవన్నీ విశాలమైన డబుల్ రోడ్లే. ఆరిలోవ ప్రాంతం నుంచి సింహాచలం వైపు వెళ్లే వారు మొదట్లో ఈ రోడ్ల మీదుగా రామకృష్ణాపురం వద్ద బీఆర్‌టీఎస్ రహదారికి చేరుకునేవారు. కొన్నాళ్లకు ఇక్కడ రోడ్ల పక్కన దట్టమైన తుప్పలు వ్యాపించడంతో అస్తవ్యస్తంగా మారడంతో వాహన చోదకుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో ఆకతాయిలు, గంజాయి తాగేవారు, మందుబాబుల సంఖ్య పెరిగింది. వారికి ఈ రోడ్లు ఆవాసంగా మారాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు ఈ ప్రాంతం నిలయమైంది.

దారిన వెళ్లేవారిపై దాడులు

గంజాయి బాబులు, మద్యం తాగినవారు గుంపులుగా ఇక్కడ ఉంటారు. ఈ ప్రాంతం గురించి తెలియని వారు అక్కడ రోడ్లపై వెళ్లేటప్పుడు వారిని మందుబాబులు, గంజాయి బాబులు అడ్డుకుంటున్నారు. కొన్నాళ్ల కిందట రామకృష్ణాపురానికి చెందిన ఓ వ్యక్తి ఈ రోడ్లులో ఆరిలోవ కాలనీకి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. గంజాయి తాగిన కొందరు యువకులు అడ్డుకుని ఆయన వద్ద డబ్బులు లేకపోవడంతో దుస్తులు విప్పించి, చేతి వాచ్ తీసుకున్నారు. నాలుగు నెలల కిందట విశాఖ కేంద్ర కారాగారంలో పనిచేస్తున్న ఓ వార్డన్‌పై దాడి చేశారు. విశాలమైన రోడ్లు కావడంతో కారు నేర్చుకుంటున్న వారి(డ్రైవింగ్ స్కూల్)పై రాళ్లతో దాడి చేస్తున్నారు.

తాజాగా శుక్రవారం సాయంత్రం ముడసర్లోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో వాకింగ్‌కు వెళ్లిన ఓ వ్యక్తిని మెడలోని చైన్‌ను కొందరు ఆకతాయిలు బైక్ మీద వచ్చి తెంచుకుని పోయారు. వెంటనే బాధితుడు ఆరిలోవ పోలీసులకు చైన్‌స్నాచింగ్‌పై ఫిర్యాదు చేశాడు. ఇలాంటి సంఘటనలు ఇక్కడ నిత్యం జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఇటీవల వీరి సంఖ్య మరింత పెరిగిపోయింది. రోడ్ల పక్కన దట్టంగా వ్యాపించిన ముళ్ల తుప్పలు, కొందరు లారీల్లో తీసుకెళ్లి డంప్ చేస్తున్న డెబ్రిస్ చాటున గంజాయి, మద్యం సేవిస్తున్నారు. తాగిన మైకంలో వారు రోడ్డు మీదకు గుంపులుగా వచ్చేస్తున్నారు. అటుగా వెళ్లే వారిని భయపెడుతున్నారు.

కానరాని పోలీస్ నిఘా..

చుట్టూ కొండలు, విశాలమైన రోడ్లు కావడంతో ప్రశాంతమైన వాతావరణం ముడసర్లోవ సొంతం. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం ఎక్కువ మంది ఇక్కడికి వస్తుంటారు. వారికి ఇక్కడ రోడ్ల పక్కన ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల మద్యం బాటిళ్ల పగలుగొట్టి గాజు పెంకులు రోడ్లపై వేసేస్తున్నారు. వాటితో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. ఇన్ని జరుగుతున్నా.. ఆరిలోవ పోలీసులు ఈ ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆరిలోవ పోలీసులు దృష్టి సారించి ఈ ప్రాంతంలో పూర్తిస్థాయి నిఘా పెట్టి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పేద మహిళకు సరకుల అందజేత



మహిళకు సరకులు అందజేస్తున్న సేవా స్ఫూర్తి సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి రవీంద్రనగర్‌లోని సేవా స్ఫూర్తి సంస్థ ఓ పేద మహిళకు చేయూత అందించింది. ముడసర్లోవ ప్రాంతం రాధాకృష్ణనగర్‌లో పండా నాగమణి అనే మహిళ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పేదరికం కారణంగా ఇళ్లు గడవడం కష్టంగా మారడంతో సేవా స్ఫూర్తి సంస్థ ప్రతినిధులు శనివారం ఆమె నివాసానికి వెళ్లి బియ్యం, పప్పులు, నూనె, నెలకు సరిపడగా నిత్యావసర సరకులు అందజేశారు. ప్రతీ నెలా ఆమె కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తామని సంస్థ వ్యవస్థాపకుడు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. గత నెలలో బి.ఎస్.ఆర్.నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ పేద మహిళకు నిత్యావసర సరకులు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రకాష్, పద్మాజీ, నందు, నానాజీ, గోవింద్, పోలరావు, కొండలరావు, గోపీ, మోహన్ పాల్గొన్నారు.

నేడు జిల్లా యాదవ సంఘం ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర జిల్లాల యాదవ సంఘం ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం సిరిపురం వుడా చిల్డ్రన్ ఎరినాలో నిర్వహించనున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణ యాదవ్ హాజరుకానున్నారన్నారు. ఇటీవల గెలుపొందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లను సత్కరించనున్నామన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వర్రు రామారావు యాదవ్, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పిలి అప్పలకొండ, ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, నమ్మి వెంకట్, మొల్లి లక్ష్మణరావు, కార్యదర్శి డొక్కర శ్రీను, సారిపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు విలీన దీక్ష’ నేడు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కు విలీన దీక్ష చేయనున్నారు. ఉక్కు రంగాన్ని వ్యూహాత్మక రంగంలో ఉంచడానికి, సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ పునఃవిలీనానికి, పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి చేయడానికి తక్షణ బెయిలౌట్ ప్యాకేజీకి ఉక్కు అధికారుల సంఘం అభ్యర్థిస్తోంది. సీ భవన్ వద్ద ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు దీక్ష నిర్వహించనున్నారు. సీ చేపట్టిన ఉక్కు విలీన దీక్షకు స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ తమ మద్దతు ప్రకటించింది. స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు సెయిల్ విలీనంతో ముడిపడి ఉన్నందున వెంటనే కేంద్రం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

సికాట్‌లో నాలుగు అపోలో పరిశోధనలకు ఆమోదం

ఆరిలోవ: అపోలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ ఖాన్ చేసిన నాలుగు శాస్త్రీయ పరిశోధన కథనాలు ఈ ఏడాది సెప్టెంబర్‌లో సెర్బియాలోని బెల్‌గ్రేడ్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ అండ్ ట్రామాటాలజీ(ఎస్ఐసీవోటీ-సికాట్) వరల్డ్ కాంగ్రెస్‌లో ఆమోదం కోసం ఎంపికయ్యాయి. వాటి గురించి అక్కడ ప్రెజెంటేషన్ ఇవ్వడానికి సెప్టెంబర్‌లో విశాఖ నుంచి వెళ్లనున్నట్లు డాక్టర్ ఖాన్ శనివారం తెలిపారు. మన రాష్ట్రం నుంచి ఇవి మొదటిసారిగా చేసిన కథనాలని ఆయన చెప్పారు. అరుదైన, వినూత్న శస్త్రచికిత్సలకు సంబంధించి శాస్త్రీయ కథనాలన్నారు. పెరోనియల్ టెండోస్కోపీ, చీలమండ, మోచేయి ఆర్థోస్కోపిక్ శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులపై ఈ పరిశోధనలు చేసినట్లు తెలిపారు.

శాకంబరిగా దుర్గాదేవి



శాకంబరి అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్‌లోని శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. దీంతో కాలనీ వాసులు ఉదయం నుంచి పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి ప్రత్యేక హారతితోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విష్ణుకుమార్‌రాజుకు అభినందన



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును అభినందిస్తున్న మిజోరం గవర్నర్ హరిబాబు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన పెనుమత్స విష్ణుకుమార్‌రాజును మిజోరం గవర్నర్ కె.హరిబాబు అభినందించారు. దసపల్లా హిల్స్‌లోని గవర్నర్ నివాసంలో శనివారం విష్ణుకుమార్‌రాజును ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పరశురాంరాజు, సుహాసిని ఆనంద్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజారుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు వెంపలి రాంబాబు, కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణంగా నేర్చుకుంటే వ్యక్తికి పరిపూర్ణత



ఇన్ఫోసిస్ ప్రాంతీయ నిపుణుడు నర్రా సురేష్‌ను సత్కరిస్తున్న అవంతి కళాశాల ప్రతినిధులు

తగరపువలస: ఒక వ్యక్తి పరిపూర్ణుడు కావాలంటే అతను సంపూర్ణంగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఇన్ఫోసిస్ విశాఖ ప్రాంతీయ నిపుణుడు నర్రా సురేష్ అన్నారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో శనివారం పరిచయ వేదికలో భాగంగా ఆయన మాట్లాడారు. పరిశ్రమకు తగిన విధంగా విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. సాంకేతిక విద్యలో నైపుణ్యాలు, విజ్ఞానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమస్యను గుర్తించడం, పరిష్కరించడంపై నిత్యం దృష్టి సారించాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్ స్కిల్స్, హాక్థాన్ ర్యాంకింగ్, కోడ్ కాంపిటీషన్, ప్రోగ్రామింగ్ స్కిల్స్, ఇంటర్వ్యూ గ్రూమింగ్, క్రియేటివిటీ ప్రాధాన్యతను వివరించారు. కార్పొరేట్ ప్రపంచంలో చోటు చేసుకున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలన్నారు. జాబ్ మార్కెటింగ్‌లో అత్యుత్తమ ఉద్యోగాలను పొందేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డీన్ అండ్ ప్లేస్‌మెంట్ హెడ్ టి.శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఎం.రూప సుందరరావు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం, కుటుంబమూ ముఖ్యమే..



పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించిన వారితో పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి, జేసీపీ ఫకీరప్ప

- కష్టపడిన సిబ్బందికి గుర్తింపు
- సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: పోలీస్ సిబ్బందికి ఉద్యోగం ఎంత ముఖ్యమో.. కుటుంబం కూడా అంతే ముఖ్యమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. కమిషనరేట్ పరిధిలో పదోన్నతులు పొందిన 17 సివిల్, ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను శనివారం కమిషనరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు కుటుంబాన్ని కూడా చూసుకోవాలన్నారు. కానిస్టేబుల్‌కు తన ఉద్యోగ జీవితంలో పదోన్నతి రావడం చాలా అరుదన్నారు.

ఐపీఎస్‌లకు ప్రతి మూడేళ్లకు ఓసారి పదోన్నతి రావడం సహజమన్నారు. అదే సంతోషాన్ని కానిస్టేబుళ్లలో ఉండాలని భావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పదోన్నతి చెందిన కానిస్టేబుళ్లను వారి కుటుంబ సభ్యుల మధ్య సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తన జీవితంలో ఇటువంటి కార్యక్రమానికి ఎప్పుడూ హాజరుకాలేదన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన వారికి సీపీ, జేసీపీ కె.ఫకీరప్ప, ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు.

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా..

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా పోలీస్ సిబ్బంది, నగర ప్రజలు, మీడియా కలసికట్టుగా పని చేయాలని సీపీ పిలుపునిచ్చారు. గంజాయి అమ్మేవారిని, సేవించే వారిని నగరం వదిలివెళ్లేలా చేద్దామన్నారు. ఇందు కోసం ఇప్పటికే నగరంలో అవసరమైన చోట సీసీ కెమెరాలు, చీకటి ప్రదేశాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. తన ఫోన్ నంబర్‌ను పబ్లిక్‌కు ఇచ్చానని, గంజాయి తాగిన వారు, అమ్మిన వారి సమాచారం వాట్సాప్/ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేసి 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

- అప్పన్నస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేయజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.
- సింహాచలేశుడికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

టెట్‌కు బ్రాహ్మణులకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: టెట్‌కు హాజరయ్యే బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వైజాగ్ బ్రాహ్మణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కాపూరి చరణ్ కుమార్ తెలిపారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులు పదో తరగతి, బీఈడీ, డీఈడీ, ఆధార్, జెరాక్స్ కాపీలను సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 99625 99790 / 92466 25822 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణ



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

బీచ్ రోడ్డు : రుషిపీఠం సత్సంగ శాఖ ఆధ్వర్యంలో శనివారం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించిన సహస్ర గల హనుమాన్ చాలీసా పారాయణ ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం ఆంజనేయస్వామి అనుగ్రహం కోసం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెంకట సత్య శ్యామ్, అరుణ గాయత్రి తెలిపారు. కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అనంతరం వారికి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బీజేపీ ప్రజాప్రతినిధులకు 15న సత్కారం

ఎంవీపీ కాలనీ: ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించి కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా సేవలు అందిస్తున్న పలువురు బీజేపీ ప్రజాప్రతినిధులను ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ నాయకత్వం ఆధ్వర్యంలో సత్కరించనున్నారు. ఈ మేరకు బీజేపీ మీడియా కో - ఇన్‌ఛార్జ్ డీఎస్ వర్మ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతోపాటు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్, ఎంపీలు పురందేశ్వరి, సీఎం రమేష్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఎన్.ఈశ్వరరావును సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం 15న సాయంత్రం 4 గంటలకు అక్కయ్యపాలెంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరిసరాలు పొడిగా ఉంచండి

కొమ్మాది: వర్షాలు కురుస్తున్నందున విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు సాధ్యమైనంత వరకు పరిసరాలు పొడిగా ఉంచుకోవాలని ఏఎంవోహెచ్ ఎన్.కిషోర్ సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు సుభాష్‌నగర్‌లో శనివారం ఆయన గడప గడపకు వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలుచోట్ల నివాసాల మధ్య నిల్వ ఉన్న నీటిని తొలగించి జీవీఎంసీ సిబ్బందితో పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జవాన్ మృతికి నివాళి





సైనిక లాంఛనాలతో జవాన్ శంకరరావు అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆర్మీ సిబ్బంది, నివాళులర్పిస్తున్న నేవీ సిబ్బంది

సింధియా: ఆర్మ్‌డ్ వర్క్‌షాప్‌నకు చెందిన సీఎఫ్ఎన్ ర్యాంకర్ గొట్టపు శంకరరావు అంత్యక్రియలను శనివారం విజయనగరం జిల్లా బాడంగిలో అతని స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణిలో శంకరరావు మృతదేహానికి తూర్పు నావికాదళం స్టేషన్ హెడ్‌క్వార్టర్స్ జిల్లా అధికారులు, నగర పోలీసులు నివాళులర్పించారు.

ట్రెజరీలో ప్రక్షాళన

- అంతర్గత బదిలీలు
- ఏటీవో,ఎస్‌టీవో, సీనియర్ అకౌంటెంట్లకు స్థానచలనం

మహారాణిపేట: పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. వరుస వివాదాలకు కారణమవుతున్న వారిని బదిలీ చేశారు. ఏటీవో, ఎస్‌టీవో, సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అకౌంటెంట్లను ట్రెజరీలో మరో విభాగానికి బదిలీ చేశారు. డబ్బులు ఇస్తే గానీ బిల్లులు చేయడం లేదని పలుశాఖల అధికారులు నేరుగా ట్రెజరీ శాఖ డైరెక్టర్ మోహన్‌రావుకు ఫిర్యాదు చేశారు. మోహన్‌రావు కూడా ఇటీవల ట్రెజరీ కార్యాలయంలో విచారణ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ బిల్లులు చేస్తున్న ట్రెజరీ ఉద్యోగుల మీద ఆరోపణలు వెల్లువగా వచ్చాయి. ఇప్పుడు ఆ విభాగానికి చెందిన అసిస్టెంటు ట్రెజరీ అధికారి (ఏటీవో) సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో), ఇద్దరు సీనియర్ అకౌంట్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ జిల్లా ట్రెజరీ అధికారి యార్లగడ్డ సుధాకరరావు ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ బిల్లులు చూసే అసిస్టెంట్ ట్రెజరీ అధికారి నాగార్జునను పోలీసు శాఖకు బదిలీ చేసి, పోలీసు శాఖలో బిల్లులు చూసే నితిన్ జోషిని మెడికల్ బిల్లులకు నియమించారు. గతంలో ఉండే ఇద్దరు సీనియర్ అకౌంటెంట్లను కూడా బదిలీ చేశారు.

నేడు జిల్లా స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

మురళీనగర్ : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో నాల్గవ జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయని వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ పోటీలకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ముఖ్య అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట లలితప్రియ పర్యవేక్షణలో ఈ పోటీలు నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. అండర్-11, 14, 17, 17 ఏళ్లు దాటిన వారికి నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. వివరాలకు 95059 50425 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ముహూర్తం చిక్కలేదా..!



అలంకారప్రాయంగా జోనల్ కమిషనర్ చాంబర్



అభివృద్ధి పనులు పూర్తయిన మధురవాడ జోనల్ కార్యాలయం

- మధురవాడ జోనల్ కార్యాలయం అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.50 లక్షల కేటాయింపు
- పనులు పూర్తయినా.. ప్రారంభించని అధికారులు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ - 2 కార్యాలయంలో పునర్నిర్మాణ, సుందరీకరణ పనులు పూర్తయినా టీడీపీ నాయకుల అపాయింట్‌మెంట్ దొరక్క అధికారులు ప్రారంభించడం లేదు. బాగా పాడుబడి, కళావిహీనంగా తయారైన జోనల్ కార్యాలయం సుందరీకరణ, పునర్నిర్మాణం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏడాది కిందట రూ.50 లక్షలు మంజూరు చేసింది. అనంతరం అధికారులు పనులు ప్రారంభించినప్పటికీ ఎన్నికలు కారణంగా కాస్త ఆలస్యమైంది. అప్పటి జీవీఎంసీ కమిషనర్ తరచూ జోనల్ కార్యాలయాన్ని సందర్శించి నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి చేయించేందుకు ప్రయత్నించారు. ఎట్టకేలకు నెల రోజుల కిందట పనులు పూర్తయి కార్యాలయం సుందరంగా ముస్తాబై అందుబాటులోకి వచ్చింది. అయినప్పటికీ నాయకులు ప్రారంభించలేదని అధికారులు వినియోగించడం లేదు.

ఇరుకు గదిలోనే జెడ్సీ విధులు

పాత భవనానికి ప్రారంభం ఏమిటి అనుకుంటే మీరు పొరబడినట్టే... రూ.50 లక్షలతో చేపట్టిన పనులు పూర్తయినప్పటికీ టీడీపీ నాయకులు ప్రారంభించకపోవడంతో జోనల్ కమిషనర్ చాంబర్ అలంకార ప్రాయంగానే మిగిలిపోయింది. ఆమె మాత్రం పక్కనే ఉన్న ఇరుకు గదిలోనే విధులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ప్రతీ సోమవారం పీజీఆర్ఎస్, కనీసం డిపార్ట్‌మెంట్స్ హెడ్స్‌తో కూడా కూర్చుని మాట్లాడుకోవడానికి స్థలం సరిపోని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రారంభానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.